క్లుప్తంగా

ముగిసిన వనదేవతల జాతర



సమ్మక్క, సారలమ్మ దేవతలను వనంలోకి తీసుకెళ్తున్న పూజారులు

జూలూరుపాడు: పడమటనర్సాపురం శ్రీసమ్మక్క, సారలమ్మ వనదేవతల మినీ జాతర నాలుగోరోజు శనివారం ముగిసింది. చివరిరోజు భక్తుల తాకిడి పెరిగింది. భక్తులు దేవతల గద్దెలను దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రధాన పూజారి కట్రం నరసింహారావు ఆధ్వర్యంలో పూజారులు శ్రీసమ్మక్క, సారలమ్మ దేవతలను గద్దెలపై నుంచి వనంలోకి తీసుకెళ్లడంతో జాతర ముగిసింది. ఈ జాతర మళ్లీ తిరిగి రెండేళ్లకు జరగనుంది.

సమ్మక్క, సారక్కలను దర్శించుకున్న జీఎం



పూజలు చేస్తున్న జీఎం జాన్‌ఆనంద్

ఇల్లెందు: ఇల్లెందు పట్టణంలోని జేకే కాలనీలోని శ్రీ నంది మేడారం సమ్మక్క, సారక్క జాతర సందర్భంగా అక్కడి ఏర్పాట్లును సింగరేణి ఇల్లెందు ఏరియా జీఎం జాన్ ఆనంద్ పరిశీలించారు. శనివారం అధికారుల బృందంతో కలిసి అక్కడి గద్దెలను సందర్శించారు. సమ్మక్క గద్దెల ఆలయ కమిటీతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ నెల 15న సాక్షిలో ఊరూరా వన దేవతలు– సౌకర్యాలకు భక్తుల వేడుకోలు, ఆదరణ తగ్గుతున్న నంది మేడారం శీర్షిక ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన జీఎం అక్కడి ఏర్పాట్లను పరిశీలించి తగు సలహాలు సూచనలు చేశారు. ఆయన వెంట ఎస్‌ఓటూజీఎం మల్లారపు మల్లయ్య, ఆలయ కమిటీ సభ్యులు దేరంగుల పోషం, నగారపు రాములు ఉన్నారు.

జేకే గ్రౌండ్ పరిశీలన

ఇల్లెందు: పట్టణంలోని జేకే కాలనీ సింగరేణి హైస్కూల్ క్రీడా మైదానాన్ని ఏరియా జీఎం జాన్ ఆనంద్ సందర్శించి పరిశీలించారు. శనివారం సింగరేణి సివిల్ డిపార్ట్‌మెంట్ అధికారులతో కలిసి గ్రౌండ్‌ను సందర్శించిన ఆయన అక్కడి వాకింగ్ ట్రాక్ నిర్మాణ పనులను, ఫ్లడ్ లైట్ల ఏర్పాటు, ఓపెన్ జిమ్ కోసం స్థలం సేకరణ అంశాలను పరిశీలించారు. వాకింగ్ ట్రాక్ పనులను వేగవంతం చేయాలని కోరారు. రెండు రోజుల క్రితం సాక్షిలో 'సింగరేణి మైదానంలో వాకింగ్'.. శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించిన జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ నెల చివరి నాటికి ట్రాక్ నిర్మాణం పూర్తి చేయాలని కోరారు. ఆయన వెంట అధికారులు రవికుమార్, అంజిరెడ్డి, వెంకటేశం, సాయి స్వరూప్, నజీర్ అహ్మద్ తదితరులు ఉన్నారు.

వేతనాలు చెల్లించండి




ఎంపీఓకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్మికులు

ఇల్లెందురూరల్: గ్రామపంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని కోరుతూ తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం ఎంపీఓ చిరంజీవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ప్రధాన జటంగి వెంకన్న మాట్లాడుతూ.. గడిచిన మూడు నెలలుగా పంచాయతీ కార్మికులకు వేతనాలు చెల్లించడం లేదని, ఈ కారణంగా కార్మికలు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నారని వాపోయారు. అధికారులు తక్షణం స్పందించి కార్మికులకు వెంటనే వేతనాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సామేలు, మోహన్‌రావు, విజయ్, తాండ్ర కిరణ్, రాధాకృష్ణ, తిరుపతి, చిన్న, మహేందర్, కన్నయ్య, శ్రీరాములు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఇల్లెందురూరల్: మాణిక్యారం గ్రామానికి చెందిన అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య కళాకారుడు కోడి శ్రీరాములు (72) శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పోలారం నుంచి స్వగ్రామం మాణిక్యారానికి బైక్‌పై వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. గమనించిన స్థానికులు శ్రీరాములును ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. శ్రీరాములుకు భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు.



బొజ్జాయిగూడెంలో వనదేవత విగ్రహం



గద్దెల వద్ద పూజ చేస్తున్న భక్తులు



జాతర వద్ద ఏర్పాటైన షాపులు

వనదేవతల పండుగొచ్చె..

రెండేళ్లకోమారు నిర్వహించే వనదేవతల జాతర రానే వచ్చింది. ఇల్లెందు మండలం బొజ్జాయిగూడెం గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో కొలువుదీరిన వనదేవతల జాతర కోసం ఆలయం అందంగా ముస్తాబైంది. సమ్మక్క, సారలమ్మ గద్దెలను రంగులద్ది తీర్చిదిద్దారు. ఈ నెల 21వ తేదీ నుంచి జాతర వేడుక అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

- 21నుంచి బొజ్జాయిగూడెంలో సమ్మక్క జాతర
- ముస్తాబైన ఆలయం, పూర్తయిన ఏర్పాట్లు
- జాతరకు ముందే వేలాదిగా తరలివస్తున్న భక్తులు



సమ్మక్క, - సారలమ్మ ఆలయ ముఖద్వారం

ఇల్లెందురూరల్: బొజ్జాయిగూడెం గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో ప్రధాన రహదారి పక్కనే వెలిసిన సమ్మక్క అమ్మవారికి ప్రారంభంలో వాహన చోదకులు పూజలు చేయడం ప్రారంభించారు. బొజ్జాయిగూడెం గ్రామానికి చెందిన ఓ భక్తునికి కలలో కనిపించి వనదేవతలు చెప్పిన మాటలతో గ్రామం ఐక్యంగా పూజలు చేయడం ప్రారంభమైంది. నాటి నుంచి బొజ్జాయిగూడెం గ్రామస్తులు అక్కడే వనదేవతల జాతర ప్రారంభించారు. మేడారం తరహాలో జాతరను అంగరంగ వైభవంగా చేస్తూ వచ్చారు. భక్తులు సైతం అమ్మవారిపై నమ్మకంతో జాతరకు పలు ప్రాంతాల నుంచి తరలివచ్చి మొక్కులు చెల్లించుకుంటూ తరించారు. ఇలా క్రమంగా భక్తుల సంఖ్య పెరుగుతూ నేడు లక్షలాదిగా భక్తులు జాతరకు తరలివస్తున్నారు.

సౌకర్యవంతంగా ఏర్పాట్లు..

బొజ్జాయిగూడెం అటవీ ప్రాంతంలో వన దేవతల జాతర సందర్భంగా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు క్రమంగా ఏటా సౌకర్యాలను కల్పిస్తూ వచ్చారు. ప్రారంభంలో గద్దెలకే పరిమితమైన వనదేవతలకు ప్రత్యేకంగా ఆలయం నిర్మించారు. చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి గద్దెల ప్రాంతాన్ని అందంగా తీర్చిదిద్దారు. జాతరకు వేలాదిగా తరలివస్తున్న భక్తుల సౌకర్యార్థం మంచినీటి బావి తవ్వించి నీటిఎద్దడి లేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. భక్తులు విడిది చేసేందుకు వీలుగా సమీపంలోని స్థలాలను శుభ్రం చేసి సౌకర్యవంతంగా తీర్చిదిద్దారు. సుదూర ప్రాంతాల నుంచి తరలివస్తున్న భక్తులు ఆలయ సమీపంలోని అటవీ ప్రాంతంలో విడిది చేస్తారు. వీరికోసం అటవీ ప్రాంతంలో ప్రత్యేకంగా తాత్కాలిక టాయిలెట్స్ కూడా ఏర్పాటు చేస్తున్నారు. జాతర సందర్భంగా భక్తుల కోసం స్టాల్స్ ఏర్పాటు చేశారు.

సండే స్పెషల్

భక్తుల రాక...

సమ్మక్క–సారలమ్మ జాతర ప్రారంభానికి ముందే బొజ్జాయిగూడెం సమీప అటవీ ప్రాంతంలో వన దేవతల గద్దెల వద్ద భక్తుల సందడి నెలకొంది. గడిచిన వారం రోజులుగా కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో బొజ్జాయిగూడెం వన దేవతలను దర్శించుకునేందుకు తరలివస్తున్నారు. కొంతమంది తమ స్వగ్రామాల నుంచి కాలినడకన ఊరేగింపుగా బొజ్జాయిగూడెంకు చేరుకుంటున్నారు. కాగా, మేడారం తరహాలోనే బొజ్జాయిగూడెం వనదేవతల జాతరలో భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేయడంపై మండల పరిషత్, పోలీసు శాఖల అధికారులు నిమగ్నమయ్యారు. ప్రధాన రహదారి పక్కనే జాతర కొనసాగుతుండటంతో వాహన చోదకులకు ఇబ్బంది కలగకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు. మండల పరిషత్ ఆధ్వర్యంలో భక్తులకు తాగునీటి సౌకర్యం కల్పించి పారిశుద్ధ్యం పనులు నిర్వహిస్తున్నారు. అంతేకాక వైద్యశాఖ ఆధ్వర్యాన ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు.

వైభవంగా నిర్వహించేలా ఏర్పాట్లు



వనదేవతల జాతరను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేశాం. తాగునీటి ఎద్దడి ఎదురుకాకుండా జాగ్రత్తలు తీసుకున్నాం. భక్తుల సంఖ్యకు అనుగుణంగా జాతర ప్రాంగణంలో ప్రత్యేకంగా సౌకర్యాలు కల్పిస్తున్నాం. పంచాయతీ, పోలీసు, వైద్య శాఖల సహకారంతో అన్ని రకాల సౌకర్యాలను అందుబాటులోకి తెచ్చాం. – చీమల వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్, బొజ్జాయిగూడెం

విద్యుత్ పనులు చేపట్టండి



మాట్లాడుతున్న పానిశెట్టి వెంకటేశ్వర్లు

పాల్వంచ: పట్టణంలోని తెలంగాణ నగర్‌లో నిలిపివేసిన విద్యుత్ పనులు వెంటనే చేపట్టాలని తెలంగాణ నగర్ వ్యవస్థాపకులు, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పానిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం స్థానిక తెలంగాణ నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తెలంగాణ నగర్‌కు నూతన విద్యుత్ లైన్ కోసం రూ.25లక్షలు మంజూరైనట్లు చెప్పారు. పనులు ప్రారంభించగానే ఫారెస్ట్ అధికారులు వచ్చి నిలిపివేశారని, వారికి పనులకు ఎలాంటి సంబంధం లేదని, ఫిర్యాదు కూడా లేదని, ఫారెస్ట్ శాఖ పరిధిలో తెలంగాణ నగర్ లేకున్నప్పటికీ పనులను అడ్డుకోవడం సరైంది కాదన్నారు. ఇప్పటికైనా ఫారెస్ట్ అధికారులు తీరు మార్చుకోవాలని లేని పక్షంలో ఆందోళన బాటపడుతామని హెచ్చరించారు. ఈ విషయంలో ప్రజల ఇబ్బందుల దృష్ట్యా జిల్లాస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలన్నారు. సమావేశంలో స్థానికులు వరహాలరావు, శ్రీను, రాము, ప్రశాంత్, లక్ష్మణ్, కిట్టు, ప్రవీణ్, రామి నాయుడు, వీరన్న, వెంకట రమణ, మల్లిక, మణెమ్మ, అన్నపూర్ణ, శాంత, మంగ, రాధ తదితరులు పాల్గొన్నారు.

'దళిత బంధు' కొనసాగించండి

జూలూరుపాడు: దళిత బంధు పథకాన్ని కొనసాగించాలని అంబేడ్కర్ యువసేన నాయకుడు తంబర్ల నరసింహారావు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శనివారం స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఇడుపుల రాజు, పత్తిపాటి మహేష్, ఎస్.ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

'గూడెం' కళాకారుడి ప్రతిభ..

కొత్తగూడెంటౌన్: తెలంగాణ మాజీ ముఖ్యమంత్రికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేయాలని పెన్సిల్‌తో వేసిన కేసీఆర్ బొమ్మను శనివారం కేసీఆర్‌కు అందజేసి తన అభిమానాన్ని చాటుకున్నాడు నవీన్. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ... కేసీఆర్ యోధా స్టోరీకి అవసరమైన కేసీఆర్ బొమ్మలను పెన్సిల్‌తో గీసి పుస్తకంలో పొందుపరిచినట్లు తెలిపారు. ఈ బొమ్మలను తన స్నేహితుడైన కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం హనుమాన్ బస్తీకి చెందిన భూక్యా రాజేష్ అనే కళాకారుడు 40 వరకు కేసీఆర్ బొమ్మలను గీసినట్లు తెలిపారు.

ఘనంగా సేవాలాల్ జయంత్యుత్సవాలు



ప్రత్యేక పూజలో పాల్గొన్న జీఎం జాన్ ఆనంద్



ఇల్లెందురూరల్: సేవాలాల్‌కు పూజ చేస్తున్న భక్తులు

ఇల్లెందు: బంజారాల ఆధ్యాత్మిక గురువు శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 285వ జయంతి సందర్భంగా శనివారం ఇల్లెందు జేకే కాలనీలో గిరిజన ఉద్యోగుల సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన వేడుకలో సింగరేణి ఇల్లెందు ఏరియా జీఎం జాన్ ఆనంద్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ... హిందూ సనాతన ధర్మం గొప్పతనం గురించి ప్రజలకు వివరించేందుకు సేవాలాల్ మహారాజ్ జన్మించాడన్నారు. కార్యక్రమంలో ఎస్టీ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి భూక్యా నాగేశ్వరరావు, ఏరియా అధ్యక్షుడు వి. కిషన్, ఈర్యా నాయక్, రవి నాయక్, కిషోర్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: లంబాడీ గిరిజనుల ఆరాధ్య గురువు సంత్ సేవాలాల్ మహారాజ్ 285వ జయంతిని మాణిక్యారం గ్రామపంచాయతీ దేశ్యా తండాలో శనివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో సేవాలాల్‌ను స్మరిస్తూ బంజారా మహిళలు పాటలు పాడుతూ సంప్రదాయ నృత్యాలతో సంబురం చేసుకున్నారు. గ్రామం నుంచి ప్రతీఒక్కరు ఒక్కో బిందె నీటితో తరలివచ్చిన మహిళలు గ్రామ దేవతలకు జలాభిషేకం చేశారు. అనంతరం సేవాలాల్‌ను స్మరిస్తూ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో చందానాయక్, గుగులోత్ వెంకన్న, బానోత్ లక్ష్మణ్, బానోత్ రాంబాబు, భావ్ సింగ్, సుమన్, నాగేష్, వెంకటేష్, రాందాస్, సుధాకర్, మోహన్, కృష్ణ, మంగీలాల్, కుమార్, సురేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నర్సరీ పనుల పరిశీలన



ముత్యాలంపాడులో నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

టేకులపల్లి: తెలంగాణకు హరితహారంలో భాగంగా గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన నర్సరీల నిర్వహణ పక్కాగా ఉండాలని టేకులపల్లి ఎంపీడీఓ గడదాసు రవీందర్‌రావు అన్నారు. ఈ మేరకు శనివారం టేకులపల్లి మండలం టేకులపల్లి, ప్రెగళ్లపాడు, రాంపురం, కొత్తతండా, సులానగర్, ముత్యాలంపాడు క్రాస్‌రోడ్ గ్రామ పంచాయతీలలో తెలంగాణకు హరితహారం పథకంలో భాగంగా ఏర్పాటుచేసిన నర్సరీలను ఆయన పరిశీలించారు. అన్నిరకాల విత్తనాలు మొలకెత్తే విధంగా చర్యలు తీసుకోవాలని, ప్రతీరోజు ఉదయం, సాయంత్రం మొక్కలకు నీళ్లు పోయాలని, కలుపు లేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి లక్ష్మీగణేష్ గాంధీ, అదనపు కార్యక్రమ అధికారి కాలంగి శ్రీనివాస్, ఈసీ తిరుపతయ్య, పంచాయతీ కార్యదర్శులు కిరణ్, లక్ష్మీనారాయణ, సందీప్, సౌజన్య, పవిత్ర, సాంకేతిక సహాయకులు చంద్మాల్, సురేష్, భీముడు, స్వప్న, ధనలక్ష్మి, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

స్వప్రయోజనాలకే పార్టీ మార్పు..



మాట్లాడుతున్న కామేష్

కొత్తగూడెంఅర్బన్: గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ భూములు కబ్జాలకు, రూ.లక్షల అవినీతికి పాల్పడిన కౌన్సిలర్లు, వారి భర్తలు పార్టీ మారితే మంచివారు అవుతారా అని బహుజన సమాజ్ పార్టీ పార్లమెంట్ జోనల్ ఇన్‌చార్జ్ యెర్రా కామేష్ ప్రశ్నించారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏ పార్టీ అధికారంలోకి వస్తే ఆ పార్టీలోకి వెళ్లి వారి స్వప్రయోజనాల కోసం పాకులాడుతున్నారని ఆరోపించారు. ఇలాంటి వారి వలన అభివృద్ధి జరగదన్నారు. కొత్తగూడెం జిల్లా కేంద్రంలో ఈ సంస్కృతి రోజురోజుకు పెరిగిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కౌన్సిలర్లు వార్డుల వారిగా అభివృద్ధి చేయాల్సింది పోయి గోవా, హైదరాబాద్, విశాఖపట్నం లాంటి ప్రాంతాలకు విహార యాత్రలకు వెళ్తూ వారికి వారే ఒక రేటును ఫిక్స్ చేసుకుంటున్నారని ఆరోపించారు. ఇలాంటి వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ప్రజా జీవితంలో నిస్వార్థ సేవలు చేసేవారు రోజురోజుకీ కనుమరుగైపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిస్సిగ్గుగా పార్టీలు మారుతున్న వారి చరిత్రను ప్రజల ముందు ఉంచుతామన్నారు. సంవత్సరకాలం లేని చైర్‌పర్సన్ పదవి కోసం అవిశ్వాస తీర్మానం అనే వీధి నాటకానికి తెరలేపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నాటకంలో ప్రతీఒక్కరు అవార్డులు పండించేంత నటనను ప్రదర్శిస్తూ నమ్మి ఓట్లు వేసిన ప్రజలకు మొండిచేయి చూపిస్తున్నారని విమర్శించారు. భవిష్యత్ తరాల కోసం, ఎన్నుకున్న ప్రజలకు జవాబుదారీతనంగా అభివృద్ధి చేయాల్సింది పోయి కేవలం డబ్బే పరమావధిగా అధికార పార్టీ నాయకుల మోచేతి నీళ్లు తాగుతున్నారని ఆరోపించారు. భవిష్యత్‌లో జరిగే ఎన్నికల్లో అయినా ఇలాంటి వారికి గుణపాఠం చెప్పే విధంగా బీఎస్పీ పార్టీ పూర్తిస్థాయి కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసి ముందుకు వెళ్తుందని చెప్పారు. సమావేశంలో సాయి, నాగుల రవికుమార్, చెనిగారపు నిరంజన్‌కుమార్, సందెల సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీఓ నుంచి ఎంపీటీసీలకు నోటీసులు

సుజాతనగర్: ఈ నెల 27న స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించే అవిశ్వాస ప్రత్యేక సమావేశానికి హాజరు కావాల్సిందిగా మండలంలోని ఎంపీటీసీలకు శనివారం నోటీసులు జారీ చేశారు. మండలంలో జరిగే అభివృద్ధి పనుల విషయంలో గానీ, ప్రభుత్వం నుంచి విడుదలయ్యే నిధుల విషయంలో గానీ తమకు సమాచారం ఇవ్వకుండా నియంతృత్వ ధోరణితో ఎంపీపీ వ్యవహరిస్తోందని ఆరోపిస్తూ ఐదుగురు ఎంపీటీసీ సభ్యులు ఇటీవల ఆర్డీఓకు ఫిర్యాదు చేసిన విషయం విధితమే. ఈ మేరకు కొత్తగూడెం ఆర్డీఓ జారీ చేసిన నోటీసులను ఎంపీటీసీలకు అందజేశారు.

క్రమశిక్షణతో లక్ష్యాన్ని సాధించవచ్చు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కల్పన



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

టేకులపల్లి: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను అలవర్చుకొని వాటి సాధనకు కృషి చేయాలని టేకులపల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎస్.కల్పన అన్నారు. ఈ మేరకు శనివారం కాలేజీ ఆవరణలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీవితంలో క్రమశిక్షణ అవసరమన్నారు. క్రమశిక్షణ ఉంటే ఎటువంటి లక్ష్యమైనా సులభంగా సాధించగలరని తెలియజేశారు. ఈనెల 28 నుంచి వార్షిక పరీక్షలు జరుగుతాయని భయాందోళన లేకుండా పరీక్షలు రాయాలని సూచించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అధ్యాపకులు జయశ్రీ , కృష్ణమూర్తి, సత్యవతి, ముంతాజ్ అలీ, శంకర్రావు, వేణుగోపాల్, శ్రీనివాసరావు, యాకుబ్, ప్రమోద్ కుమార్, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

డంప్ యార్డ్‌గా మారిన వాగు



వాగులో పేరుకుపోయిన చెత్త

టేకులపల్లి: మండల కేంద్రంలోని శ్రీకోదండ రామాలయం ఎదురుగా ఉన్న ఇనుపమోరి వాగు చెత్తకుండీగా మారింది. పర్యవేక్షణ లేపోవడంతో చుట్టుపక్కల ప్రజలు ఇళ్లల్లో నుంచి చెత్త, వీధుల్లోని చెత్త అందరూ తెచ్చి వాగులోనే వేస్తుండటంతో చెత్త పేరుకుపోయి నీటి ప్రవాహం ఆగిపోతోంది. విపరీతంగా దుర్వాసన వస్తోంది. ఈనెల 7 నుంచి 15 వరకు స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. అయినా వాగులో చెత్త మాత్రం తొలగించలేదు. ఈ వాగు రెండు పంచాయతీల పరిధిలో ఉండటంతో మాది కాదంటే మాది కాదంటున్నారు. వాగులో చెత్తకు బాధ్యులెవరో ఉన్నతాధికారులే తేల్చాలి.

ప్రమాదకరంగా రహదారి



మార్కెట్ సమీపంలో గుంతలు పడిన దృశ్యం

జూలూరుపాడు: మండలంలోని తల్లాడ–కొత్తగూడెం ప్రధాన రహదారి ప్రమాదకరంగా ఉంది. జూలూరుపాడు ఉపమార్కెట్ యార్డు సమీపంలో, సాయిరాంతండా, పడమటనర్సాపురం గ్రామాల్లో ప్రధాన రహదారి దెబ్బతిని గుంతలు ఏర్పడ్డాయి. అదేవిధంగా రహదారి పక్కన ఏర్పడిన గోతులు మరింత ప్రమాదంగా ఉన్నాయి. పడమటనర్సాపురం గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల సమీపంలో ఆర్‌అండ్‌బీ మెయిన్ రోడ్ పక్కన గోతులు ఉన్నాయి. అదేవిధంగా మేడారం జాతర సందర్భంగా వాహనాల రద్దీ పెరగనున్నది. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు ప్రజలు కోరుతున్నారు.

మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు

భారత రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్) అధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు 70వ జన్మదిన వేడుకలు కొత్తగూడెం, ఇల్లెందు కొత్తగూడెం నియోజకవర్గాల్లో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. నాయకులు మాట్లాడుతూ.... ఉద్యమ కాలమైనా, పరిపాలనైనా కేసీఆర్ మార్క్ మరువలేనిదన్నారు. తెలంగాణ జాతిపితగా నిలిచిపోతారని పేర్కొన్నారు. కేసీఆర్ తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించారన్నారు. అనంతరం ప్రభుత్వాస్పత్రుల్లో పాలు, పండ్లు పంపిణీ చేశారు. జిల్లా గ్రంథాలయ కమిటీ మాజీ చైర్మన్ దిండిగల రాజేందర్, ఎస్.రంగనాథ్, దేవీలాల్ నాయక్, కొత్తగూడెం మాజీ ఎమ్మెల్యే వనమా, ఎడవల్లి కృష్ణ, కిలారు నాగేశ్వరరావు, బరపటి వాసుదేవరావు, యల్లంకి సత్యనారాయణ, లకావత్ గిరిబాబు, బొమ్మెర వరప్రసాద్, బోడ బాలునాయక్ తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



ఇల్లెందు: కేక్ కట్ చేస్తున్న రాజేందర్, నాయకులు



టేకులపల్లి: కేసీఆర్ పుట్టినరోజు వేడుకలో నాయకులు, కార్యకర్తలు



జూలూరుపాడు బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో..



పాత పాల్వంచలో కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే వనమా, నాయకులు



నవభారత్ పాఠశాలలో కేక్ కట్ చేస్తున్న వీరన్న